
ప్రజాశక్తి
సోమవారం 28 ఏప్రిల్ 2025



బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వచ్చే నెల 2 నుంచి 4 వరకు కాకినాడలో జరిగే 12వ రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. సారిపల్లిలో ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.వి.ప్రభావతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్ష్మణరావు, ట్రెజరర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు తౌడు బాబు, శ్రీను, గోపాల్, భాను, తిరుపతిరావు, ఆదిబాబు, వెంకటరావు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు రంగారావుదొర, చైర్మన్ ఐవిపి రాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జిల్లా జట్లు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

గంటేడ రచనల్లో జాతీయ స్ఫూర్తి

- అభ్యుదయ భావాలతో గుండెలను హత్తుకున్న రచనలు ఎన్నో
- గాయకులు గొంతు కలుపుతూ సామ్రాజ్యవాదాన్ని అడ్డుకోవాలి
- పుస్తకావిష్కరణ సభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు రాతలు జాతీయ స్ఫూర్తిని రగిలిస్తాయని మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎంవిఎస్ శర్మ అన్నారు. అభ్యుదయ భావాలు, శాస్త్రీయత, ముందు చూపు ఉట్టిపడే విధంగా కూడా ఉంటాయని వివరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, చంద్రికారాణి దంపతులు తమ కుమారుడు రవితేజ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తాము స్థాపించిన చీకటి ప్రచురణలు వెలుగుల కోసం అనే పబ్లిషింగ్ సంస్థ ద్వారా గౌరునాయుడు రచించిన పాటల పుస్తకాన్ని ముద్రించారు. ఈ పుస్తకాన్ని ఆదివారం స్థానిక జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, ప్రముఖ వైద్యులు జి.సన్యాసమ్మ, ప్రముఖ కవి అట్టాడ అప్పలనాయుడు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ దేశంలో ప్రపంచీకరణ మొదలైన కాలంలోనే గౌరునాయుడు పాడుదమా స్వేచ్ఛాగీతం అంటూ జాతీయ ఉద్యమాన్ని గుర్తుచేశారని వివరించారు. ఇప్పటికీ ఈ గీతం అవసరం పెరగడం గౌరునాయుడి దార్శనికత, ముందు చూపునకు నిదర్శనమని తెలిపారు. ఇటువంటి కవులను, వారి సాహిత్యాన్ని అణచివేయడానికి పాలకపార్టీలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే గురజాడ వంటి మహాకవుల వర్ధంతులను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. గురజాడ రచనలను మరుగున పెట్టడం ప్రభుత్వ అవివేకమేనని, ఆయన రచనలు ఎప్పుడో ఎల్లలు దాటిపోయాయని, ఆయన దార్శనికత, వ్యక్తిత్వం దాచేస్తే దాగిపోయేవి కాదన్న సంగతి పాలకులు గుర్తించుకోవాలని హితవుపలికారు. దేశ ప్రధాని, కేంద్ర మంత్రులు కూడా ఇటీవల ఆయన రచనలు గుర్తుచేసుకున్నారని చెప్పారు.

కొలువుదీరిన సాహితీలోకం

పాడుదమా స్వేచ్ఛాగీతం పుస్తకావిష్కరణ సందర్భంగా విజయనగరం ఒక్కటే కాదు, ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని కవులు, కళాకారులు, గాయకులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు జెడ్‌పి ప్రాంగణంలో కొలువుదీరారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు సందడిగా మారింది. ముఖ్యంగా పాడుదమా స్వేచ్ఛాగీతం అంటూ ప్రజాగాయకుడు దేవిశ్రీ అలపించిన పాట జాతీయోద్యమాన్ని గుర్తుచేస్తూ సభికుల్లో ఒకింత స్ఫూర్తిని నింపింది. గంటల గౌరునాయుడు... గానాల గౌరునాయుడు అంటూ ఆ రచయిత శక్తి సామర్థ్యాలను, మనోభావాలను తెలకపల్లి రవి చమత్కరించిన తీరు సభికులను ఆలోచింప జేసింది.

గౌరునాయుడు రాసిన 'కరెంటమ్మ కరెంటు.... ఏం కరెంటు' అంటూ జానపద కళాకారుడు జానకిరాం ఆలాపన, ఈ పాట ఒక జోల.... ఈ నేల ఉయ్యాల... అంటూ ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు తన సంగీత మేళవింపు సభికులను రంజింపజేసింది. ఇలా ఒకటా రెండా గౌరునాయుడు గేయాలతో ప్రజా గాయకులు ఆహూతులను ఆలోచింపజేశారు. పాయల మురళీకృష్ణ, కంచరాన భుజంగరావు, కొత్తూరి శ్రీనివాస్ సారథ్యంలో సాగిన ఈ కార్యక్రమంలో అనేక మంది గౌరునాయుడికి ఆప్త వాక్యాలను అందించారు.

ఓ విద్యార్థిని కోరిక మేరకే 'స్వేచ్ఛాగీతం' : గంటేడ



ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఇంత ప్రాచుర్యం పొందిన పాడుదమా స్వేచ్ఛాగీతం అనే పాట తాను ఓ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తుండగా ఓ విద్యార్థిని కోరిక మేరకు రాశానని ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు గుర్తుచేశారు. తెలుగు ఉపాధ్యాయుడిని అయినప్పటికీ, సోషల్ ఉపాధ్యాయుడు ఆ రోజు రాకపోవడంతో తాను ఆ సబ్జెక్టు బోధించాల్సి వచ్చిందని తెలిపారు. ఆ సందర్భంలో భారతి అనే విద్యార్థిని పాఠ్యాంశం బోధిస్తుండగానే పాట రూపంలో చెప్పాలని కోరిందని, పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో బస్సు కోసం నిరీక్షిస్తూ రాసి ఆ చిన్నారికి ఇచ్చేశానని చెప్పారు. అలా రాసిన పాట జాతీయోద్యమ స్ఫూర్తినిస్తుందంటే తనకు ఎంతో సంతోషం మిగిల్చిందని వివరించారు. తన పాటలన్నింటికీ ఒక పుస్తక రూపం ఇవ్వడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు.

జెడ్‌పి స్కూళ్లలో కళింగ సాహిత్యం

మజ్జి శ్రీనివాసరావు



ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ప్రతి జిల్లా పరిషత్తు స్కూల్లోనూ, గ్రంథాలయాల్లోనూ ఉత్తరాంధ్ర కవులు, రచయితలు రాసిన పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటానని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సంగీతం, సాహిత్యం, కళలకు విజయనగరం పుట్టినిల్లువంటిదని చెప్పారు. ఆ పేరు నిలబెట్టేందుకు వీలుగా జిల్లా పరిషత్తు ప్రాంగణంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించి సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేం దుకు కృషి చేస్తున్నానన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రముఖుల జయంతులు, వర్ధంతుల్లో గురజాడను విస్మరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా గురజాడ పేరును ప్రముఖుల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

గిరిజన గూడేల్లోనూ గంటేడ పాటలు

డివిజి శంకరరావు

గిరిజన గూడేల్లోనూ కవి గంటేడ గౌరునాయుడు రాసిన పాటలు మారుమోగుతున్నాయని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. ఇటీవల తాను ఓ గిరిజన గూడేనికి వెళ్లినప్పుడు పాడుదమా స్వేచ్ఛాగీతం అంటూ స్వాగతం పలికారని గుర్తుచేశారు. గౌరునాయుడు రచనలు నేటితరం కవులు, కళాకారులకు ఆదర్శమన్నారు.

రాజకీయ భాగస్వామ్యంతోనే సాహిత్య వికాసం : అట్టాడ



సాహితీరంగ లక్ష్యం నెరవేరాలంటే రాజకీయ నాయకుల భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రముఖ కవి అట్టాడ అప్పనాయుడు అన్నారు. అందుకు రాజకీయ నాయకులు కూడా కలిసి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అద్భుతమైన సాహిత్యం అందించినప్పటికీ అది ప్రజల్లోకి వెళ్లాలంటే ముద్రించేవారు, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారి అవసరం ఉందన్నారు. అందుకనుగుణంగా సాహితీకారులు, సాహితీప్రియులు, రచయితలు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛాగీతం పేరిట గౌరునాయుడు రాసిన సుమారు 203 పాటలను చీకటి దివాకర్ ముద్రించడం అభినందనీయమన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో ఇటీవల వెలువడిన కళింగ కథా నేల పుస్తకాలు ప్రజల్లోకి వెళ్తున్నాయని అన్నారు.

సాహిత్యంతోనే వికాసం

డాక్టర్ సన్యాసమ్మ

సంగీతం, సాహిత్యం వంటి కళల ద్వారానే మానవాళి వికాసం సాధ్యమౌతుందని ప్రముఖ వైద్యులు సన్యాసమ్మ అన్నారు. మారిన జీవన శైలిలో పుస్తక పఠనం లేదా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవచ్చన్నారు. గౌరునాయుడు రచనలు దేశభక్తిని, పోరాట స్ఫూర్తిని నింపుతున్నాయని ఆమె కొనియాడారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్లో నిర్వహించిన కార్యకర్తల రెండో రోజు ఆదివారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్పు చేసిందన్నారు. కార్మిక వర్గానికి ఉన్న హక్కులను తగ్గించి, యజమానులకు అనుకూలంగా మార్పులు చేశారని చెప్పారు. వీటిని కేంద్ర కార్మిక సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా.. మోడీ ప్రభుత్వం మొండిగా అమలుకు ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి అమల్లోకి వస్తే కనీస వేతనాలు, బోనస్, పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టాలు ప్రమాదంలో పడతాయని తెలిపారు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కును కూడా ఈ లేబర్ కోడ్లు నిరాకరిస్తున్నాయని చెప్పారు. కార్మికులకు ఈ కోడ్ల వల్ల ఏమాత్రమూ ప్రయోజనం లేదన్నారు. మరోవైపు మోడీ ప్రభుత్వం కొత్త పరిశ్రమలను నెలకొల్పకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం, అమ్మడం వంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున కార్మిక వర్గం పోరాడుతుంటే, కార్మికులపై ఉక్కు పాదం మోపేందుకు ఈ చట్టాల్లో మార్పులు చేస్తోందని తెలిపారు. అందుకే వీటి రద్దు కోసం మే 20న సమ్మెకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు.

అనంతరం సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.శంకర్రావు, కె.సురేష్ జిల్లా ఉపాధ్యక్షులు టి.వి.రమణ, వి.లక్ష్మి, బి.సూర్యనారాయణ, ఎ.గౌరినాయుడు, కార్యదర్శులు ఎ.జగన్మోహన రావు, బి.రమణ, ఎం.రమణ , జిల్లా కమిటీ సభ్యులు కె.గురుమూర్తి, సురేష్, త్రినాథ్, శ్రీను, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఐపిఎల్‌లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉండాలి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ • క్రీడాకారులకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



క్రీడాకారుడికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఐపిఎల్ లాంటి స్థాయిలో ఆడే విధంగా జిల్లాలో క్రీడాకారులు తయారు కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. జోనల్, రాష్ట్ర స్థాయిలో ఆడి, విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఆదివారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మైదానం, క్రీడా సౌకర్యాలను వినియోగించుకుని ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా తయారు కావాలన్నారు. మానసిక ఆరోగ్యం క్రీడల వల్ల సాధ్యమవుతుందన్నారు. సవాల్ స్వీకరించి, బాగా రాణించాలన్నారు.

అనంతరం కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ గత ఐదేళ్లలో క్రీడలను ధ్వంసం చేశారని, అందుకే ఈ మైదానానికి ఐదేళ్లు రాలేదని చెప్పారు. క్రీడా మైదానాలను చిల్లర కొట్టు మాదిరిగా తయారు చేసిందన్నారు. కొండవెలగాడలో రూ.50 లక్షలతో అంతర్జాతీయ సౌకర్యాలతో జిమ్ నిర్మిస్తే, ఆ జిమ్‌లో ఉన్న మెటీరియల్ తీసుకెళ్లిపోవడం దౌర్భాగ్యమన్నారు. డబ్బులు తినడానికి అసోసియేషన్ కాదని, క్రీడాకారులను తయారు చేయడం, ప్రోత్సహించడం కోసం పని చేయాలని సూచించారు.

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ చరిత్ర, శ్రమ గురించి తెలిసినప్పుడే మనం బాధ్యతగా ఉంటామన్నారు. క్రీడాకారుల విషయంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని అసోసియేషన్, కోచ్‌లను కోరారు. అనంతరం క్రీడాకారులను సత్కరించి, కొంతమందికి స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాంబాబు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లాకు 3,379 యూనిట్లు

- తొలి విడతగా 400 మందికి
- త్వరలోనే సబ్సిడీ విడుదల
- దశల వారీగా మిగిలిన లబ్ధిదారుల ఎంపిక
- 'ప్రజాశక్తి'తో బిసి కార్పొరేషన్ ఇడి జి.పెంటోజీరావు



జిల్లాకు 3,379 బిసి రుణాలు మంజూరయ్యాయని బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.పెంటోజీరావు అన్నారు. ఇందులో తొలివిడతగా 400మందికి రుణాలు మంజూరు చేస్తున్నట్టు వివరించారు. మిగిలిన లబ్ధిదారులను దశల వారీగా ఎంపిక చేసి రుణాలు అందజేయనున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారులకు త్వరలోనే ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేస్తుందని వివరించారు. లబ్ధిదారుల ప్రాజెక్టు రిపోర్టు, ఇతర అర్హతల ఆధారంగానే ఎంపిక చేస్తామన్నారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

జిల్లాలో బిసి రుణాలు ఎంతమందికి ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు.?

బిసి కార్పొరేషన్ ద్వారా జిల్లాకు 3,379 యూనిట్లు మంజూరయ్యాయి. వీటికోసం సుమారు 20,450 దరఖాస్తులు అందాయి. అందరికీ ఒకేసారి కాకుండా విడతల వారీగా రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా రుణాల మంజూరుకు కసరత్తు జరుగుతోంది.

ఇప్పటి వరకు ఎంత మందికి రుణాలు మంజూరు చేశారు.?

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈ నెల 11నాటికి 400 మందికి తొలివిడతగా రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకనుగుణంగా దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు చేపట్టాం. బ్యాంకర్లు కూడా ఆమోదం తెలిపారు. ప్రభుత్వం తరపున సబ్సిడీ మంజూరుకాగానే బ్యాంకర్లు కూడా మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయడానికి సిద్ధంగా ఉన్నారు.

మిగిలిన వారికి ఎప్పటిలోగా మంజూరు చేస్తారు?



కొన్ని ముఖ్యమైన దినాలను పురస్కరించుకుని రుణాలు మంజూరు చేయాలని భావిస్తున్నాం. అందులో భాగంగానే బిసి ఉద్ధారకుడు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా తొలి విడత గ్రౌండింగ్ పూర్తిచేశాం. ఆగస్టు 15 నాటికి కూడా కొన్ని రుణాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారుల నుంచి సూచనలు ఉన్నాయి. తొలి విడత పూర్తికాగానే మలివిడత కసరత్తు చేపడతాం.

ఎలాంటి యూనిట్లు మంజూరు చేస్తున్నారు? మచ్చుకు కొన్ని చెప్పండి.?

స్వయం ఉపాధికి ఎలాంటి యూనిట్లు పెట్టుకున్నా ప్రభుత్వం తరపున ప్రోత్సాహం ఉంటుంది. కానీ, దరఖాస్తుదారులు వాస్తవానికి దగ్గరగా తన ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొనాలి. ఇంటర్వ్యూల్లో దానిపై వివరించగలిగితే చాలు. ప్రస్తుతం మంజూరుచేసిన యూనిట్లలో ఆటో, మినీ ట్రాక్టర్, సెల్‌పాయింట్లు, కిరాణా, పాన్‌షాప్, మినీ హోటల్స్ వంటివి ఎక్కువగా ఉన్నాయి.

యూనిట్ విలువ ఎంత? సబ్సిడీ ఎంత వరకు ఉంటుంది.?

చేపట్టే వ్యాపారాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ఉంటుంది. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాల ద్వారా సంబంధిత కుటుంబం ఆర్థికంగా ఎదిగి నిరుద్యోగాన్ని జయించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం లబ్ధిదారునికి మంజూరైన మొత్తంలో ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 50శాతం సొమ్ము బ్యాంకర్లు రుణాలుగా ఇస్తారు.

లబ్ధిదారుని ఎంపిక ఎలా జరుగుతుంది.?

మండల స్థాయిలో ఎంపిడిఒ, బ్యాంకరు సెలక్షన్ కమిటీలో ఉంటారు. పురపాలక సంఘాల్లో మున్సిపల్, నగర పాలక సంస్థ కమిషనర్లు ఉంటారు. అక్కడ ఎంపిక చేసిన జాబితాను జిల్లాకు పంపుతారు. మరోసారి అన్నీ పరిశీలించాక కలెక్టర్ ద్వారా సబ్సిడీ కోసం ప్రభుత్వానికి జాబితా పంపుతాం. లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున సబ్సిడీ మంజూరు అయ్యాక బ్యాంకర్లు తమ వాటా మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

బిసి పరిధిలో ఎన్ని ఉపకులాలు ఉన్నాయి.?

మన జిల్లాలో బిసిల పరిధిలోకి మొత్తం 139 కులాలు ఉంటాయి. జిల్లాకు మంజూరైన మొత్తం యూనిట్లు వారి అర్హతలను బట్టి అన్ని కులాలవారికీ ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుంది. కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియులు, బ్రాహ్మణు, ఒసి కాపులకు సంబంధించిన రుణాలు కూడా మన జిల్లాలో బిసి కార్పొరేషన్ ద్వారానే మంజూరు చేయబడతాయి.

జిఓ 20తో ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్

సొంతింటి నిర్మాణం ప్రతిఒక్కరి కల. ఏదో ఒక రోజు సొంతిల్లు నిర్మించుకోవాలని ఆశపడుతుంటారు. దాని కోసం ప్రత్యేకంగా ప్రణాళిక వేసుకుని డబ్బులు కూడబెడతారు. ఇంటి కల సాకారం చేసుకునేందుకు అహర్నిశలు కష్టపడతారు. పేద, మధ్యతరగతి ప్రజలు సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చి తోడ్పాటు అందిస్తుంటాయి. కానీ ప్రపంచ బ్యాంకు ఆంక్షల నేపథ్యంలో పట్టణ ప్రణాళిక విభాగంలో నూతన సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం జిఓ 20 రూపంలో తీసుకొచ్చిన అలాంటి సంస్కరణలో చిన్న చిన్న లోపాలు పేద, మధ్యతరగతి ప్రజల పాలిట శాపాలుగా మారాయి.



విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయం

- తగ్గనున్న మున్సిపాలిటీల ఆదాయం
- 50 రోజులుగా ఒక్క ప్లాన్ కూడా లేని వైనం
- ముందుకు రాని లైసెన్స్ సర్వేయర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణ ప్రణాళిక విభాగంలో పలు సంస్కరణలను చేపట్టింది. సంస్కరణలో భాగంగా తీసుకొచ్చిన జిఓ 20 నేడు ఇల్లు కట్టుకునేందుకు ఆటంకంగా మారింది. గత ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని ముందుకెళ్లింది. నేటి కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ప్రణాళిక విభాగంలో ఇంటి నిర్మాణాలకు సంబంధించి జిఓ 20ని తీసుకొచ్చింది. మున్సిపాలిటీలో, నగరపాలక సంస్థల్లో ఇంటి నిర్మాణ అనుమతులకు లైసెన్స్ సర్వేయర్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. గతంలో లైసెన్స్ సర్వేయర్లు ప్లాన్ పెడితే వాటిని పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు మంజూరు చేసేవారు. నేడు జిఓ 20 ప్రకారం టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రమేయం లేకుండా నేరుగా లైసెన్స్ సర్వేయర్లు ప్లాన్ కోసం దరఖాస్తులు పెట్టడంతోపాటు వారే ఇంటి నిర్మాణం చేపడుతుండగా వివిధ దశల్లో ఫొటోలు పెట్టే అవకాశం ఇచ్చింది. ప్రణాళిక అధికారులు కేవలం పరిశీలించి రిపోర్టు ఇస్తే చాలు. ఇక్కడ నామమాత్రమే ప్రణాళిక అధికారుల బాధ్యత. చివరికి ఇంటి నిర్మాణం జరిగితే సర్టిఫికెట్ చేసే అధికారం కూడా లైసెన్స్ సర్వేయర్లకు ప్రభుత్వం ఇచ్చింది.

తేడా వస్తే..

అంత వరకు బాగానే ఉన్నా, ఇక్కడే అసలు సమస్య ఇక్కడే మొదలైంది. ఇంటి నిర్మాణ అనుమతులకు పూర్తి బాధ్యులు లైసెన్స్ సర్వేయర్లు, ఇంటి యజమాని. ఇద్దరు ఇంటి నిర్మాణంలో ఎటువంటి తప్పులు జరగకుండా, డివియేషన్ లేకుండా కడతామని వ్యక్తిగతంగా అంగీకార పత్రం రాసి ఇవ్వాల్సి ఉంది.

ఒక వేళ ప్లాన్ ప్రకారం ఇంటి నిర్మాణం లేకపోతే సర్వేయర్‌కి ఐదేళ్లపాటు లైసెన్స్ రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు జిఓ 20లో పేర్కొన్నారు. దీంతో లైసెన్స్ సర్వేయర్లు ఎవరూ ఇంటి నిర్మాణ ప్లాన్ పెట్టేందుకు ముందుకు రావడం లేదు. జిఓ వచ్చిన తర్వాత గత 50 రోజులుగా ఒక్క ప్లాన్ కూడా రాకపోవడమే అందుకు నిదర్శనం. ఇంటి నిర్మాణ ప్లాన్ రాకపోవడంతో మున్సిపాలిటీలకు, నగర పాలక సంస్థలకు రావాల్సిన ఆదాయం కూడా పడిపోయింది. మరో వైపు ప్రభుత్వం కూడా కొత్త లైసెన్స్ సర్వేయర్లను ప్రోత్సహించాలని చెబుతున్నప్పటికీ ఏ ఒక్కరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జిఓలో సవరణ చేస్తే తప్ప ప్లాన్ పెట్టేందుకు ముందుకు వచ్చే పరిస్థితి లేదని లైసెన్స్ సర్వేయర్లు వాపోతున్నారు. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

సొంత పూచీకత్తు అనేది సరికాదు



జిఓ 20 ద్వారా భవన నిర్మాణం కోసం దరఖాస్తు పెడితే, భవనం ఎటువంటి డివియేషన్ లేకుండా రూల్స్ ప్రకారం కడతామని చెప్పి సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని చెప్పడం సరికాదు. దీంతో పాటు ఏమైనా నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం జరిగితే మా లైసెన్సు ఐదేళ్లు రద్దు చేయడం, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిఓలో పేర్కొనడం తీవ్ర అభ్యంతకరం. అందుకే దీనిని సవరించాలి.

- బి.శ్రీనివాసరావు, లైసెన్స్ సర్వేయర్

జిఓ 20ను సవరించాలి



భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు జిఓ 20 పెద్ద ఆటంకంగా ఉంది. మమ్మల్ని బలిపశువులను చేసే విధంగా జిఓ తీసుకొచ్చారు. భవన నిర్మాణంలో ఏ చిన్న తప్పు జరిగినా మా లైసెన్సు రద్దు చేసి, క్రిమినల్ చర్యలు తీసుకుంటామనడం సరికాదు. జిఓ 20ను సవరిస్తే తప్ప భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు పెట్టేది లేదు.

- అల్లి శ్రీనివాసరావు, లైసెన్సు సర్వేయర్

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి11కెవి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణ పనుల పొడిగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం మదుపాడ, పినతలిమి,పెద తలిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకటాపాలెం, గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



గాయని శృతి సారణిని అభినందిస్తున్న చాన్సలర్ జిఎస్ఎన్ రాజు

కర్ణాటక గాయనికి అభినందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రముఖ కర్ణాటక సంగీత గాయని వంకాయల శృతి సారణి ఆలిండియా రేడియో భక్తి సంగీత గానంలో 'ఎ' గ్రేడ్ హోదా సాధించిన సందర్భంగా ఆమెను సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు వంకాయల నరసింహం మనవరాలు ఈమె అని చెప్పారు. కర్ణాటక సంగీత సంప్రదాయాల సంరక్షణ, ప్రోత్సాహానికి గాను ఆమెకు ఏ గ్రేడ్ లభించిందని అన్నారు. శృతి సారణి మాట్లాడుతూ తాను కర్ణాటక సంగీతాన్ని ప్రొఫెసర్ కె. సరస్వతి, ఎం.ఎస్.ఎన్.మూర్తిల పర్యవేక్షణలో శిక్షణ పొందినట్లు తెలిపారు.




శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సులభంగా ఆంగ్లం బోధిస్తే విద్యార్థులకు మేలు

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యార్థులకు అర్థమయ్యేలా ఆంగ్లం సులభంగా బోధిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆంగ్లం కోర్స్ డైరెక్టర్ చోడిగంజి రవి అన్నారు. స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం డెల్టా ఆధ్వర్యంలో ఆంగ్లం భాషా పునశ్చరణ శిక్షణ నిర్వహించారు. శిక్షకులు శ్రీకాకుళం, విజయనగరం, ఉభయగోదావరి జిల్లాల నుంచి 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కష్టంగా ఉన్న ఆంగ్ల పదాలను సులభంగా విద్యార్థులు అర్థమయ్యే రీతిలో ఎలా బోధించాలో ఆంగ్లం కోర్సు డైరెక్టర్ రవి శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులకు డెల్టా అధ్యక్షుడు ఎం.విజయమోహన్, సభ్యులు సర్టిఫికెట్స్ ఇచ్చారు.



పుస్తకాన్ని చదివిస్తున్న గ్రంథాలయ నిర్వాహకుడు మహేష్

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకూ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని గ్రంథాలయ నిర్వాహకులు మహేష్ తెలిపారు. ఈ వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థులు హాజరై వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం చదువు కోవడం ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు.

పర్యాటకులపై ఉగ్రదాడి దారుణం

ప్రజాశక్తి - కురుపాం

జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకున్నారని, ఈ దాడులు అత్యంత దారుణమని కురుపాం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నెల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రెస్క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం కురుపాంలో గల రావాడ జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తులు వెలిగించి శాంతియుత ర్యాలీ చేపట్టి జర్నలిస్టులు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు కులాలు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ఈ చర్యలను ఖండించి దేశ ప్రజలంతా ఒక తాటిపైకి వచ్చి ఉగ్రవాదం ఎదుర్కోవాలని కోరారు. కార్యక్రమంలో పాత్రికేయులు జి.వెంకటరావు, కె.మౌళి, ప్రసాద్, ఎస్ శ్రీను, జి.డిల్లీశ్వరరావు, పి.సురేష్, డి.ప్రదీప్, ఎం.పృధ్వీ, సంతు, శేషు, బి.అనిల్, బి.స్వాతి, శబరిస్, మణి, మనోజ్, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, చంటి, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : జమ్మూ- కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులకు నిరసనగా వీరఘట్టం పట్టణ ప్రజలు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల అంతం కావాలి, ఉగ్రవాదులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

భద్రత లేని బతుకులు

- పరిశ్రమల్లో మగ్గుతున్న కార్మికులు
- కనీస సదుపాయాలకు నోచుకోని వైనం
- ఇదీ మినీ పారిశ్రామిక వాడ దైన్య స్థితి

ప్రజాశక్తి - పూసపాటి రేగ

భద్రత లేని బ్రతుకులు.. కనీస సదుపాయాలకు నోచుకోని కష్టజీవులు.. అరకోర జీతాలతో కాలం వెలదీస్తున్న కార్మికులు.. పట్టించుకోని అధికారులు.. మినీ పారిశ్రామిక వాడగా వెలుగుతున్న పూసపాటిరేగ మండలంలోని పరిశ్రమాల్లో పనిచేస్తున్న కార్మికుల దైన్యస్థితి.. వారి అవస్థలపై ప్రత్యేక కథనం.

పూసపాటిరేగ మండలాన్ని ఒక మినీ పారిశ్రామిక వాడగా చెప్పుకుంటారు. ఈ ప్రాంతంలో మైలాన్, ఎస్ఎంఎస్, హెచ్‌బిఎల్, సిపి ఆక్వా, విజయనగర్ బయోటెక్, డానిక, రెడ్డీస్, అరబిందో లాంటి పరిశ్రమలు సుమారుగా 15 వరకూ ఉన్నాయి. సుమారుగా 10 వేల మంది కార్మికులు ఈ పరిశ్రమల్లో పనిచేస్తున్నారని అంచనా. వీరిపై వీరి కుటుంబీకులు సుమారుగా 50వేల మంది ఆధారపడి ఉన్నారు. కార్మికులకు పనికి తగ్గా వేతనం లేకపోయినప్పటికీ కనీస సదుపాయాలకు నోచుకోవడం లేదంటే నమ్మలేని నిజం. పనికి తగ్గ వేతనం లభించడం లేదని సిఐటియు ఎప్పటినుంచో గగ్గోలు పెట్టినా యాజమాన్యాలు పెడచెవిని పెడుతున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కార్మికుడు గుంతెత్తి తన సమస్యను చెప్పుకునే స్వాతంత్రం లేకుండా చేసింది. వారి పక్షాన పోరాడుతున్న సిఐటియు లాంటి సంస్థలకు కఠినమైన ఆజ్ఞలు జారీ చేసి నొరునొక్కే ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రభుత్వం వచ్చాక కార్మికుడు యాజమాన్యాల కింద బానిసల మారిపోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి.

అరకొర జీతాలు

పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనాలు లేక కనీస సదుపాయాలు లేక అరకొర జీతాలతో కాలం వెలదీస్తున్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి కార్మికులకు ప్రయోజనం కల్పించే వాటిని కట్టకపోయినా కాంట్రాక్టర్‌లను పరిశ్రమలు కనీసం ప్రశ్నించకపోవడం ఆశ్చర్యకరం. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం దారుణం. ఎంతోమంది కార్మికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఇఎస్ఐ హాస్పిటల్ కోసం ఎన్నో ఏళ్లుగా సిఐటియు పోరాటం చేస్తుంది. అయినా ఫలితం దక్కడం లేదు. కార్మికుల పక్షాన మాట్లాడే పాలకులు కరువయ్యారు.



కలుషితమవుతున్న భూ గర్భజలాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం(ఫైల్)

మరోపక్క కాలుష్యంతో సతమతం

పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యానికి కార్మికులతో పాటు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వెంటనే ప్రభుత్వాలు చొరవ తీసుకొని కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పూసపాటిరేగ సిఐటియు మండల కమిటీ డిమాండ్ చేస్తుంది. ఇక్కడ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కూడా ఏ రకమైన భద్రత లేదు. సరియైన భద్రత ప్రమాణాలు లేకపోవడం వల్ల పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలో అనేక మంది కార్మికులు తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు పాటించాలని చెప్పి డిమాండ్ చేస్తున్నారు. ఇంకొక పక్క కొన్ని రసాయనిక పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులకు గురై తమ ఆరోగ్యాలను పాడు చేసుకుని జీవితాంతం బాధపడుతున్నారు. వీటి పైన కూడా ప్రభుత్వాలు ఏ రకమైన చర్యలూ తీసుకోవడం లేదు. ఈ ప్రాంతంలో సుమారు 10 వేల మంది కార్మికులు పనిచేస్తునందున ఇక్కడ ఒక ఇఎస్ఐ డిస్పెన్సరీ అవసరం ఉందని అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ ఇక్కడ ఇఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు విశాఖపట్నం మల్కాపురంలో ఉన్న ఇఎస్ఐ హాస్పిటల్‌కి తీసుకెళ్లడం తప్ప వేరే మార్గం లేదు. వెంటనే పూసపాటిరేగ పారిశ్రామిక ప్రాంతంలో ఒక ఇఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తాగునీటి కాలుష్యంతో అవస్థలు

ఈ పరిశ్రమల ద్వారా వెదజల్లుతున్న జల, వాయు, శబ్ద కాలుష్యం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతుంది. ఈ కాలుష్యాలను నియంత్రించడానికి అటు పరిశ్రమల యాజమాన్యాలు కానీ, ఇటు ప్రభుత్వాలు గానీ పట్టించుకున్న పరిస్థితులు లేవు. పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ జలాలు భూగర్భంలో కలిసిపోయి ఈ ప్రాంతంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు గ్రామాలే తాగునీటి లేక విలువలాడుతున్న పరిస్థితి నెలకొంది. వాయు కాలుష్యంతో పిల్లలు, వృద్ధులు,



పిఎఫ్ కట్టలేదని మైలాన్ కంపెనీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు(ఫైల్)

మహిళలు, గర్భిణీలలో శ్వాసకోశ వ్యాధులు ప్రబలి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్షవాతం, కీళ్ల నొప్పులు క్యాన్సర్ లాంటి వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఇదంతా యాజమాన్యాలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిసినా బహిరంగ సత్యమే. ఈ సమస్యలపై యూనియన్లు తదితర సంస్థలు పోరాటం చేస్తే వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వాలు పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తుంటే సమస్యలున్నాయని ఆపేయడం ఎలా అంటూ ప్రజాప్రతినిధులే తిరిగి గొంతు ఎత్తడం ఈ ప్రాంతంలో విడ్డూరం. ప్రజలు ప్రాణాలు కాపాడవలసిన పాలకులే యాజమాన్యాలు తొత్తులుగా మారిపోతుండటంతో ఇలాంటి దుస్థితి నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు. పరిశ్రమల కాలుష్యం వల్ల పచ్చని పంట పొలాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. పంట దిగుబడి తగ్గిపోయి రైతులు ఆర్థిక స్థితి దిగజారిపోయి అప్పుల పాలవుతున్నారు. ఈ కాలుష్యం మత్స్యకారులను మరింత వెంటాడుతుంది. పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్ధ జలాలను సముద్రంలోకి వదిలేయడంతో చేపలు చనిపోతున్నాయి. మత్స్యకారుల పక్షాన పోరాడే నాయకుడే కరువయ్యాడు. ప్రభుత్వం కూడా వారికి వేట నిషేదం భృతి ఇస్తుందే తప్ప సమస్యలపై దృష్టి పెట్టడం లేదు. దీంతో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

రేపు విశాఖలో జాబ్‌మేళా

ప్రజాశక్తి- వేపాడ

ఈ నెల 29వ తేదీన విశాఖ గీతం కాలేజీలో నిర్వహించనున్న జాబ్ మేళాను యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. విశాఖ ఎమ్‌పి భరత్‌కు చెందిన గీతం కాలేజీలో యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేశారన్నారు. ఈ మేళాలో అమర్ రాజా కంపెనీ యాజమాన్యం పాల్గొంటుందని నేరుగా అభ్యర్థులు ఎంపిక జరుగుతుందని చెప్పారు. పదో తరగతి పాస్ ఫెయిల్, ఇంటర్మీడియట్ పాస్ ఫెయిల్, ఐటిఐ పాస్ ఫెయిల్ వయసు 18 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాలు కలిగిన యువతీ యువకులు ఇందులో పాల్గొనవచ్చునన్నారు. శిక్షణ కాలంలో ఎస్ఎస్‌సి విద్యార్హత కలిగిన వారికి 24 నెలల్లో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు, స్టయి ఫండ్ రూ.12,500 నుంచి రూ.15వేలు వరకూ ఇస్తారన్నారు. ఇంటర్మీడియట్‌కు 18 నెలలు శిక్షణ, ఐటిఐ వారికి12 నెలలు శిక్షణ, శిక్షణ పూర్తయిన తర్వాత నెలకు రూ.22వేలతో కూడిన వేతనం ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని వేపాడ మండలంలో గల యువతీ యువకులు సద్విని చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూ గీతం కళాశాలలో ఉదయం 9గంటల నుంచి నిర్వహిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి వేపాడ మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, విశాఖ పార్లమెంటు సమన్వయకర్త జనపరెడ్డి ఈశ్వరరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎం. రామకృష్ణ, బల్లంకి మాజీ సర్పంచ్ జి నాగరాజు, అడ్వకేట్ జి రవి, మాజీ ఎంపిటిసి రమణ, పలువురు మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొంప కృష్ణ



మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ మోహనరావు

సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంచాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యార్థులలో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంచాలని డిప్యూటీ డిఇఒ మోహనరావు కోరారు. స్థానిక వాసు జూనియర్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక, గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం శిబిరాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అనేక అంశాల్లో సృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథం కల్పించడం కోసం చేస్తున్న ఈ ప్రయత్నంలో విద్యార్థులు సఫలీకృతులు కావాలన్నారు. నైతిక విలువలు, మానవీయ కోణం, సోదరి భావం పెంపొందించే దిశగా కృషి చేయాలన్నారు. జనవిజ్ఞాన వేదిక, గ్రీన్ బెల్ట్ సొసైటీ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముట్నూరు వేణు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు రమణమూర్తి, రిసోర్స్ పర్సన్‌లు స్వామినాయుడు, గౌరు నాయుడు, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, ప్రవీణ్, రాజు, రమేష్, యుటిఎఫ్ నాయకులు ప్రసన్న కుమార్, త్రినాధ్, పాల్గొన్నారు.

నేడు ధర్నా

ప్రజాశక్తి కొమరాడ

మండల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నామని, దీన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే జల గ్రామంతో పాటు నయా పంచాయతీల్లో పలు గ్రామాలకు నేటికీ పూర్తి స్థాయిలో తాగునీరందని పరిస్థితి ఉందన్నారు. అలాగే వనకాబడి, గుమ్మడిగెడ్డ, తోటపల్లి, జంఝావతి వంటి నీటి వనరులను పూర్తిచేయాలని, గిరిజన గ్రామాల్లో చెక్‌డాంల నిర్మాణంపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. భూ సమస్యల పైన కూడా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. నేటికి 10 వారాలుగా పెండింగ్ ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించలేదన్నారు. ఈ సమస్యలన్నింటిపైనా సోమవారం తలపెట్టిన ధర్నాలో మండల ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య, కోటి పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

615 వాహనాలను సోదా చేసిన పోలీసు బృందాలు ● రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలోనూ..

ప్రజాశక్తి -విజయనగరంకోట

పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో డిజిపి ఆదేశాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ఆకస్మికంగా వాహన తనిఖీలు, లాడ్జిలు, హోటళ్లు, పబ్లిక్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పోలీసు అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ప్రధాన జంక్షన్ల వద్ద ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అనుమానితుల బ్యాగులను సోదా చేశారు. పోలీసుశాఖకు చెందిన స్నిపర్ డాగ్స్, బాంబ్ డిస్పోజల్ బృందాలు ముఖ్య కూడళ్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద బాంబ్‌లను గుర్తించే ప్రత్యేకమైన పరికరాలతో తనిఖీలు చేపట్టాయి. జిల్లాలోకి ప్రవేశించే ప్రధాన మార్గాలు, సరిహద్దు జిల్లాలకు వెళ్లే ముగింపు ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల వద్ద సుమారు 615 వాహనాలను తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు లాడ్జిలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. బస చేసే వ్యక్తులు ఎందుకు వచ్చింది, ఏ పని మీద వచ్చింది తెలుసుకొని, వారి గుర్తింపు కార్డులను పరిశీలించారు. అనుమానితుల వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ డివైజ్‌లతో తనిఖీ చేసి, వారి నేర చరిత్రను పరిశీలించారు.



కార్లలో తనిఖీలు చేస్తున్న పోలీసులు



విజయనగరం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తనిఖీల్లో 13మంది వ్యక్తులు ఇతర ప్రాంతాల నుంచి వివిధ పనుల మీద జిల్లాకు వచ్చి, లాడ్జిల్లో బస చేస్తున్నట్లుగా గుర్తించామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలను డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు పర్యవేక్షించారు.

ఇదేం 'చెత్త' పాలన : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీలో ఇదేం "చెత్త" పరిపాలనని, డంపింగ్ యార్డ్ పక్కనే చెత్తలు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయని, చెత్త శుద్ధి కేంద్రం ఏర్పాటు ఎప్పుడు చేస్తారని కాంగ్రెస్, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. ఆదివారం ఆ పార్టీ నాయకులు వి.దాలి నాయుడు, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, గేదెల రామకృష్ణ, కోలా కిరణ్ కుమార్, తీళ్ళ గౌరీ శంకరరావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శి చుక్క చంద్రరావు తదితరులు ఆదివారం రాయగడ రోడ్డులో గల డంపింగ్ యార్డ్ వద్ద అంతర్ రాష్ట్ర రహదారిపై వేసిన చెత్త డంపింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపల్ పాలన గాడి తప్పి ఒదని ఆరోపించారు. దీనికి ఉదాహ రణగా అంతం "రాష్ట్ర రహదారిపై చెత్త డంపింగేనన్నారు. గతంలో వైసిపి పాలనలో వర్షాకాలంలో డంపింగ్ యార్డ్ లోకి వాహనాలు వెళ్లవంటూ అంతర్రాష్ట్ర రహదారిలో చెత్తను డంపు చేసే వారన్నారు. ఇప్పుడు కూటమి పాలనలో వైసిపికి ఏమీ తీసిపోమన్నట్లు వేసవిలోనే అంతర్రాష్ట్ర రహదారిపై చెత్తను డంపింగ్ చేస్తున్నారన్నారు. వైసిపి, కూటమి రెండింటి పాలన దొందు దొందేనని విమర్శించారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలన్నారు. వేసవిలో చెత్త డంపింగ్ యార్డులో పొగ మంటలు ప్రారంభం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చెత్త డంపింగ్ యార్డ్ నిర్వహణతో పాటు మున్సిపాలిటీలో 24/7 పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలకు ఆరోగ్యాన్ని అందివ్వాలి అన్నారు. రాయగడ రోడ్డు లోని చెత్త డంపింగ్ యార్డ్ వల్ల, చెత్తను రోడ్డుపై డంప్ చేయడం వల్ల కొమరాడ మండలంతో పాటు ఒడిశా నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే సమీపంలోని జట్టు ఆశ్రమం, జగన్నాథపురం, వివేకానంద కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కబ్జాలు తొలగింపు పట్ల పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

1100 మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 1100 మట్టి నమూనా సేకరణ లక్ష్యంగా మట్టిని సేకరిస్తున్నామని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పాంచాలిలో రైతులు చల్ల వెంకట్రావు, యు.చిన్నారావు క్షేత్రాల్లో మట్టి నమూనాల సేకరణలో పాల్గొన్నారు. ప్రతి రైతు మట్టి నమూనాల సేకరణకు ముందుకు రావాలని, దగ్గరుండి తమ మట్టి నమూనాలను తీయించి గ్రామ వ్యవసాయ సహాయకునికి అందించాలని అన్నారు. మట్టి నమూనాల విశ్లేషణ ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకుంటే డబ్బు ఆదా కావడమే కాకుండా నేలలో పోషక సమతుల్యత ఏర్పడుతుందని అన్నారు. పోషక లభ్యత మధ్య పోటీ నివారించబడుతుందన్నారు. కావున రైతులు తప్పనిసరిగా తమ మట్టి నమూనాలను దగ్గరుండి తీయించుకోవాలని తెలిపారు.

ఎకరం మడిలో నాలుగు ఐదు చోట్ల ఈ ఆకారపు గుంత తవ్వి అంచుల వెంబడి మట్టి సేకరించాలని దీని అంతటినీ కలిపి ఆరబెట్టి మెత్తని 250 గ్రాముల మట్టిని విశ్లేషణ కొరకు మట్టి విశ్లేషణ కేంద్రాలకు పంపించాలని తెలిపారు. మట్టి నమూనా ఎలా సేకరించాలి, వీటివల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కావున రైతులంతా మట్టి నమూనాలను సేకరించి గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ ఈదుబిల్లి శ్రీను, సిఆర్‌పి తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు, వ్యాను ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - దత్తిరాజేరు

మండలంలో కోమటిపల్లి మరడాం గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున కారు, వ్యాను ఢీకొన్న ఘటనలో తూర్పుగోదావరి జిల్లా పెనకనమట్ట గ్రామానికి చెందిన పల్లి సురేష్ బాబు(45) మృతి చెందాడు. జీడి పిక్కల వ్యాపారం రీత్యా పార్వతీపురం నుండి విజయనగరం వైపు కారులో వస్తుండగా వ్యాను కారును ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయని బూర్జివలస ఎస్ఐ ఎస్.రాజేష్ తెలిపారు. గాయపడిన వారిని విజయనగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



ఎదురెదురుగా ఢీ కొన్న కారు, వ్యాను

70 ధాన్యం బస్తాలు దగ్ధం

ప్రజాశక్తి- బాడంగి

మండల కేంద్రంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో బాడంగికి చెందిన చంద్రునాయుడు చెందిన 70కు పైగా ధాన్యం బస్తాలు, మూడు గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం 2 గంటలు సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో సంవత్సరమంతా కష్టపడి పండించిన పంట, పశువుల కోసం దాచుకున్న గడ్డి కుప్పలు కాలిపోయవడంతో కుటుంబ సభ్యులందరూ కన్నీరు మున్నీరయ్యారు. రెండు సంవత్సరాలు క్రితం కూడా ఇలానే జరిగిందని వాపోయారు. ఎవరో కావాలనే తమపై ఇలాంటి ప్రయోగాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో 120 ధాన్యం బస్తాలు కాలిపోయయాని గుర్తు చేశారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న వరి కుప్పలు, ధాన్యం బస్తాలు

ఆలస్యంగా వచ్చిన అగ్నిమాపక సిబ్బంది

అగ్నిప్రమాదాన్ని గుర్తించిన గ్రామస్తులందరూ కలిసి బిందెలతో నీటిని తెచ్చి మంటలను అదుపు చేయాలని ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అగ్నిప్రమాదం జరిగిందని పక్కనే కూత వేటు దూరంలో ఉన్న ఫైర్ ఇంజెన్‌కి ఫోన్ చేసినా గంట వరకూ అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకోలేదు. అంతా కాలిపోయాక గంట తరువాత గంటల లారీ రావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతా అయిపోయిన తరువాత ఎందుకు వచ్చారని, వద్దు వద్దు వెళ్లిపోండి అని మండి పడ్డారు. అక్కడే ఉన్న ఎంపిటిసి శ్రీనివాసరావు సర్ది చెప్పిన తరువాత కాలిన కుప్పలను తడిపి మంటలను అదుపు చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

కొబ్బరి చెట్టు వివాదం రక్తసిక్తం

- ఇరు గ్రూపుల మధ్య కొట్లాట
- నలుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- 20మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - సంతకవిటి

పంటపొలంలో కొబ్బరి చెట్టు వల్ల శనివారం రాత్రి జరిగిన వివాదం రక్తసిక్తమైంది. ఈ ఘర్షణలో నలుగురుకు తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. రాజాం రూరల్ సిఐ హెచ్. ఉపేంద్రరావు, సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుళ్ళసీతా రాంపురం గ్రామంలో ముగడ సూర్యనారాయణ పొలంలోని పదిరోజుల క్రితం కొబ్బరి చెట్టును కొల్లి మురళి నరికేశాడు. దీంతో ఇరు కుటుం బాల మధ్య వాగ్వాదం జరిగి గ్రామ పెద్దలు వద్దకు చేరింది. అక్కడ పరిష్కారం కాకపోవడంతో శనివారం రాత్రి కొల్లి మురళి ఇంటి సమీపంలో కర్రలతో ఇరు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. నలుగురుకి తీవ్ర గాయాలు అవ్వడంతో చికిత్స నిమిత్తం రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్య కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఒకరికి పరిస్థితి విషమించడంతో వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. ఇరువర్గాల కొట్లాటలో 20 మంది పై కేసులు నమోదు చేశాం అని సిఐ తెలిపారు. అనంతరం శ్రీకాకుళం సర్వజన ఆసు పత్రికి పోలీసులు వెళ్ళి బాధితులను పరామర్శించి, గొడవలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు సంతకవిటి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న సిఐ